క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్స వమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వ క్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదా తలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్‌వో నాయుడికి చెక్కు అందిస్తున్న దాత శివకుమార్

సింహాచలం : శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరానికి చెందిన ఎస్.శివకుమార్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో పీఆర్‌వో నాయుడికి అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

డీఎఫ్‌వోగా జగన్నాథ్‌సింగ్



నర్సీపట్నం: జిల్లా అటవీ శాఖ అధికారిగా ఆర్.జగన్నాథ్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం రాష్ట్రంలో ఐఎఫ్‌ఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. 2013 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు చెందిన జగన్నాథ్‌సింగ్ ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఏపీఎఫ్‌డీసీ రీజనల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నర్సీపట్నం డీఎఫ్‌వోగా పనిచేసిన రాజారావు ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అనకాపల్లి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ స్థానంలో జగన్నాథ్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని కార్యాలయ అధికారులు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు ఆలయానికి విశేషంగా తరలివచ్చారు. స్వామివారి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

బలరాముని అలంకరణలో అప్పన్న



బలరామాలంకారంలో అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి బలరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని బలరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో వేంజేంపచేసి, సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూషతో కలిసి వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న అదీప్‌రాజ్



ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి: రాష్ట్రంలోని ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. పెందుర్తి మండలం పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో మంగళవారం ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ క్రీడాకారులకు సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనుష, ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, పార్టీ నాయకులు మానాలత జోబ్‌దాస్, దాడి అర్జున, మధుపాడ అంజి, గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీను, ఆదిరెడ్డి మురళి, టి.వినోద్, టి.నర్సింగ్, సంపత్‌వర్మ, అధికారులు, నాయకులు, పీఈటీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే పోటీలు

సబ్బవరం : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని సబ్బవరం మదర్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నిర్వహించిన సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ బోకం సూర్యకుమారితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాలనూ ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే బ్యాటింగ్ చేయగా వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ బౌలింగ్ చేసి క్రీడాకారులను, యువకులను ఉత్సాహపరిచారు. ఎంపీడీవో రమేష్ నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, కోటాన రాము, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడు, ఈవోఆర్‌డీ మహేష్, నాయకులు బోకం రామునాయడు, సబ్బవరపు నారాయణమూర్తి, యర్రంశెట్టి రాము, ఐడీ బాబు, బోను గంగునాయుడు, సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: మండలంలో రావాడ, వెన్నలపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రావాడ గ్రామంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు ప్రారంభించారు. వెన్నలపాలెంలో ఎంపీటీసీ సభ్యురాలు వెన్నల అరుణకుమారి, నాయుడుపాలెంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి, వాడచీపురుపల్లిలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడాకారులకు చక్కటి వేదిక

పరవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. పరవాడలో ఏపీఐఐసీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఆటల పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు సామగ్రి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 47 రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో యువతీ యువకులు పాల్గొని సత్తా చాటాలన్నారు. ఇది క్రీడాకారులకు చక్కటి అవకాశమన్నారు. పరవాడలో ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనేందుకు 533 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ క్రీడల్లో 15–60 ఏళ్ల లోపు వయస్సు ఉన్న స్త్రీ, పురుషులు పాల్గొనే అవకాశం కల్పించారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు, నగదు పురస్కారాలతో సత్కరిస్తామని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, తహసీల్దార్ పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



టాస్ వేసి క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



రావాడలో పోటీలు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు

జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు సుందర్రామిరెడ్డి, శ్రీరామసంజయ్, సురేంద్ర, సాయిరవి జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. వీరు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 31 వరకు భోపాల్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. గత నెలలో రాజమండ్రిలో నిర్వహించిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఈ నలుగురు విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు. జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, కోచ్ రామ్మోహన్, సీఈవో కె.నిశాంత్ అభినందించారు.



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రైతుబజార్ ఎస్టేట్ అధికారిగా పద్మావతి



పెందుర్తి: స్థానిక రైతుబజార్ ఎస్టేట్ అధికారిగా వి.పద్మావతి శర్మిల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఈవో నారాయణ చేతుల మీదుగా ఆమె బాధ్యతలు అందుకున్నారు. రైతులకు, వినియోగదారులకు తగిన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు.

ఆపరేషన్ పరివర్తనతో గంజాయి నిర్మూలన



మాట్లాడుతున్న డీఐజీ ఎస్.హరికృష్ణ

అనకాపల్లి: విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో కొత్తగా ఏడు పోలీస్‌స్టేషన్లను ప్రభుత్వ ఆదేశాలు మేరకు అప్‌గ్రేడ్ చేయనున్నట్టు డీఐజీ ఎస్.హరికృష్ణ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని 2021లో ఏర్పాటు చేసి, రేంజ్ పరిధిలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో 8 మండలాల్లో ఎక్కువగా గంజాయి సాగు ఉండేదని, వివిధ ప్రభుత్వశాఖల అధికారుల సహకారంతో గంజాయి సాగును నిర్మూలిస్తు, గిరిజన రైతులకు ప్రత్యేక పంటలపై అవగాహన కల్పించామన్నారు. ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఒడిశా రాష్ట్రంలో మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల నుంచి ఆంధ్ర రాష్ట్రానికి గంజాయి రవాణా జరుగుతోందని, ఎక్కడిక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, రవాణా చేస్తున్న వ్యక్తులపై పీడీ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కోరాపుట్ డీఐజీతో ఈ అంశంపై ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యక్తులు గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. రేంజ్ పరిధిలో జాతీయ రహదారులపై ప్రమాదాలను ఈ ఏడాది ఎక్కువశాతం నిర్మూలించామని పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. అనకాపల్లి డీఎస్పీ నూతన కార్యాలయ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావ్యవస్థకు చేరుకున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కేవీ.మురళీకృష్ణ, డీఎస్పీ వి.సుబ్బరాజు పాల్గొన్నారు. డీఐజీ కె.హరికృష్ణ మండలంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌ను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సంరక్షణ కార్యదర్శుల సహాయంతో బాల్యవివాహాలను అరికట్టి, సైబర్ క్రైంను నియంత్రించగలిగామని చెప్పారు. డీఎస్పీ వి.సుబ్బరాజు, ట్రెయినీ డీఎస్పీ భవ్య, రూరల్ సీఐ రవికుమార్, పట్టణ సీఐ టి.శ్రీను ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సుందరంగా థీమ్ పార్కుల అభివృద్ధి



షిప్‌యార్డు లే అవుట్‌లోని యోగా థీమ్ పార్కు పరిశీలిస్తున్న నగర కమిషనర్ సాయికాంత్ వర్మ



నిర్మాణం పూర్తయిన స్పోర్ట్స్ థీమ్ పార్కు

పీఎం పాలెం : ఆధునిక సమాజానికి అనుగుణంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా థీమ్ పార్కులు తీర్చిదిద్దుతున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ 6, 8 వార్డుల పరిధిలో నిర్మాణంలో ఉన్న థీమ్ పార్కులను మంగళవారం ఆయన పరిశీలించారు. పీఎం పాలెం షిప్‌యార్డు లే అవుట్‌లో నిర్మిస్తున్న యోగా థీమ్ పార్కును, బక్కన్నపాలెం బుచ్చిరాజు లే అవుట్‌లోని స్పోర్ట్స్ థీమ్ పార్కును, ఎమ్మెస్సార్ లే అవుట్‌లోని ల్యాండ్ స్కేప్ థీమ్ పార్కును, వైఎల్‌పీ లే అవుట్ ఫామ్ గార్డెన్ పార్కును పరిశీలించారు. యోగా థీమ్ పార్కును పచ్చని మొక్కలతో నింపాలని, స్పోర్ట్స్ థీమ్ పార్కులో వాలీబాల్, షటిల్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ఏరియాలో గ్రీనరీ కోసం ఆకర్షణీయమైన మొక్కలు 15 రోజుల్లో నాటాలని ఆదేశించారు. అనంతరం కొమ్మాది జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. లా కాలేజీ జంక్షన్ ప్రమాదకరంగా ఉన్నందున వీ కన్వెన్షన్ ఎదురుగా స్థలం సూచిస్తూ జంక్షన్ తరలించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెడ్సీ కనక మహాలక్ష్మిని ఆదేశించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీ కల్చరల్ ఎం.దామోదర రావు, పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పరవాడ: రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నామని సంఘ జిల్లా కోశాధికారి ఎం.సంతోష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు పరవాడ తహసీల్దార్ పి.కనకారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అటెండర్లు, వాచ్‌మెన్‌లు, డ్రైవర్లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు టి.సన్యాసిరావు, కార్యదర్శి ఆర్.వి.ఎస్.శంకరరావు, కటారి రాము, పైడిరాజు, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన
- జనవరి 5న తుది జాబితా ప్రకటన
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: ఓటరు జాబితాలను పారదర్శకంగా సిద్ధం చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, మండల అధికారులతో గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ పురోగతిపై మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా నియోజకవర్గంలో ఓటరు జాబితాల తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. కొత్తగా ఓటు హక్కు కోసం, అదేవిధంగా ఇతర ప్రాంతాల నుంచి పేరు మార్పు కోసం డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన ప్రతీ దరఖాస్తును బీఎల్‌వో స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. బీఎల్‌వోలు చేసిన సర్వేపై మండల స్థాయి అధికారులు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై అన్ని రకాల వివరాలను రాజకీయ పార్టీలకు ఇస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, కలెక్టర్ సూచనలకు అనుగుణంగా నియోజకవర్గంలో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన చేస్తామన్నారు. 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలియజేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన



దేశపాత్రునిపాలెంలో విద్యుత్ స్తంభం పరిశీలిస్తున్న అధికారులు

పరవాడ: మండలంలో పి.బోనంగి, దేశపాత్రునిపాలెం, కలపాక, వెన్నలపాలెం గ్రామాల్లో ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ, ఏఈ శేషసాయి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో మరమ్మతులు చేయాల్సిన స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు పరిశీలించారు. వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నామని రామకృష్ణ చెప్పారు. ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



వేపాకుల అలంకరణలో రాస పోలమాంబ



రేగు, కమలా, దానిమ్మ పండ్ల అలంకరణలో కొత్తమ్మవారు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో రేగు, దానిమ్మ, కమలా పండ్లతో అలంకరించారు. ఈ అలంకరణకు పాలిశెట్టి పైడిరాజు, జానకి, బి.సంతోష్‌కుమార్, శ్రావణి దంపతులు ఆర్థిక సహకారం అందించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అలంకరణ పూర్తి చేశారు. భీమిలి మండలం మజ్జివలసకు చెందిన గ్రామదేవత రాస పోలమాంబను నిర్వాహకులు వేపాకులతో అలంకరించారు. ఈ సందర్భంగా టి.లోకేష్‌రెడ్డి, కె.మనోజ్ రెడ్డి, పి.నవీన్‌రెడ్డి, టి.అప్పలరాసయ్య, రాసమ్మ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అదిరిన ఆహ్వాన్ ఫెస్ట్



సందడి చేసిన సినీ నటి అవికాగోర్

దాబాగార్డెన్స్: విద్యార్థుల కేరింతలతో ఏవీఎన్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'ఆహ్వాన్ ఫెస్ట్' మంగళవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించగా.. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీతార అవికాగోర్, నటులు బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. చదువుకుంటేనే భవిష్యత్ అంటూ హితవు పలికారు. ఫెస్ట్‌లో భాగంగా డ్యాన్స్, మ్యాజిక్, సింగింగ్, స్కిట్, స్టాండప్ కామెడీ, డైలాగ్ వార్స్, ర్యాంప్ వాక్‌తో విద్యార్థులు అదరగొట్టారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు అందుకున్నారని.. అందుకు ఎంతో గర్విస్తున్నానన్నారు. వారందరి స్ఫూర్తితో విద్యార్థులు మరింతగా చదివి ఇటు కళాశాలకు..అటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారని చెప్పారు.

హిందూ ధర్మాన్ని ఆచరించాలి



మజ్జివలస ఎస్సీ కాలనీలో దత్త జయంతి వేడుకలకు హాజరైన గ్రామపెద్దలు

తగరపువలస: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ ప్రచారం చేయాలని వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు అన్నారు. భీమిలి మండలం మజ్జివలస ఎస్సీ కాలనీలో గుడిలోవ విజ్ఞాన్ విహార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత చెడు మార్గంలో పయనించకుండా ఉండేందుకు భక్తిమార్గం వైపు నడవాలని సూచించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నప్రసాదాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు తుపాకుల ఆదిలక్ష్మి, అప్పలరాజు, గాడు వెంకటనారాయణ, లచ్చుభుక్త జగదీష్, నీలాపు సూర్యనారాయణరెడ్డి, గాడు వెంకటరావు, సురాల వెంకటరావు, కొయ్య రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com